## క్లుప్తంగా

### రామదాసు ఫౌండేషన్ వితరణ



శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీరామపురానికి చెందిన అన్నాబత్తుల శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. శ్రీనివాస్ పేద కుటుంబానికి చెందినవాడు కావడంతో వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌కు రామదాసు ఫౌండేషన్ చైర్మన్ అబ్బిరెడ్డి సురేష్ రూ.6 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆకుల ఈశ్వరరావు, ఎం.బుజ్జి, అబ్బిరెడ్డి మూర్తి, గారపాటి బాలాజీ, గుద్రాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యాకానుక కిట్ల పంపిణీ



జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న నాయకులు

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లి ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పాము నాగవేణి, పాము చిట్టిబాబు, స్కూలు కమిటీ చైర్మన్ కళల వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎంఈఓ-2 ఉమకు ఎంపీపీ అభినందనలు



ఎంఈఓ-2 ఉమను అభినందిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండల రెండో విద్యాశాఖాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మోకా ఉమకు ఎంపీపీ రాయుడు సునీత అభినందనలు తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని ఉమ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపీపీ దుశ్శాలువాతో సత్కరించి మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.మంగాయమ్మ, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్ ఉన్నారు.

### వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పటవల పంచాయతీ ఎస్సీ పేటకు చెందిన కమిడి వీరగనిక(47) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని ఎంపీపీ రాయుడు సునీత, స్థానిక సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, కె.చంద్రశేఖర్, దిమ్మల విజయ్‌కుమార్ తదితరులు పరామర్శించి ఓదార్చారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేశారు. మరో రూ.90 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమవుతుందని పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్ సునీత తెలిపారు.

### ఓఎన్‌జీసీ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

యానాం: ఓఎన్‌జీసీ పనుల నిమిత్తం నిత్యం ప్రయాణిస్తున్న లారీలు, భారీ వాహనాల వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిరసన తెలుపుతూ బుధవారం స్థానిక దరియాలతిప్ప ఎస్సీ గ్రామస్తులు ఓఎన్‌జీసీ సైటులో పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీవాహనాలతో లారీ కన్నా ఎక్కువ ఎత్తులో ఉండే పెద్దబండరాళ్లను తరలిస్తున్నారని, ఒక్కోసారి అవి జారిపడి పలువురు గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఓఎన్‌జీసీ సైటు పక్కనే ఉన్న దరియాలతిప్పలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని తాము అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనికి స్పందించిన ఓఎన్‌జీసీ అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కమిడి బాలయోగి, మెల్లం చిన్న, సబ్బతి శ్రీనివాసరావు, తిరుకోటి నాగేశ్వరరావు, మోకా బుజ్జి, ములపర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి పనుల్లో బిజీ బిజీ

- తోటలను బలపరచుకునే పనిలో కొబ్బరి రైతులు
- వరి చేల మట్టి తరలించి ఎత్తుపల్లాల చదును



వరిచేలల్లో మట్టి తీసుకొచ్చి తోటల్లో వేసుకుంటున్న రైతులు

ముమ్మిడివరం: నెలనెలా ఆదాయం అందించే కొబ్బరి అంటే రైతులకు మక్కువెక్కువ. ఏడాదిలో అధిక భాగం వరి సాగుకే పరిమితమయ్యే ఈ ప్రాంత రైతులు వేసవి సీజన్ రాగానే కొబ్బరి తోటలను బలపరచుకునే పనిలో పనిలో పడతారు. ఏప్రిల్, మే నెలల్లో కొబ్బరి తోటలను సారవంతం చేసుకొనే పనులకు అధిక ప్రాధాన్యమిస్తారు. దీంట్లో భాగంగానే వరి సాగుకు ప్రస్తుతం విరామం కావడంతో కోనసీమ రైతులు మట్టి పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. వరి చేలల్లోని మెరకలను తొలగించి ఆ మట్టిని కొబ్బరి తోటల్లో వేసి ఎత్తు పల్లాలను చదును చేసుకుంటున్నారు. గత నెల రోజులుగా రైతులు తోటలను బలపరచుకునే పనులను ముమ్మరంగా చేస్తున్నారు.

**కలుపు మొక్కల తొలగింపు**

కోనసీమలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో కొబ్బరి చెట్లు ఉన్నాయి. వేసవి నేపథ్యంలో కొంతమంది రైతులు వేలాది రూపాయలను వెచ్చించి వరి చేలల్లో ఉన్న నల్ల రేగడి మట్టిని కొబ్బరి తోటల్లో వేసి భూములను సారవంతం చేసుకుంటున్నారు. తోటల్లో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన కలుపు మొక్కలను తొలగించి గట్లను పటిష్ట పరిచే పనుల్లో రైతులు తన మునకలయ్యారు. చేలగట్లపై ఉన్న కొబ్బరి చెట్ల మొదళ్లను పలుగులతో పెకలించి వేర్లను గుల్ల చేస్తున్నారు. కొబ్బరి చెట్ల చుట్టూ ఉన్న వేర్లను తొలగించి అడుగులోతు గోతులు తీసి పశువుల పెంట, పచ్చిరొట్టతో నింపుతున్నారు. దీంతో పాటు పలు పర్యాయాలు తోటలకు నీరు పెట్టి మర నాగళ్లతో దుక్కి దున్నుతున్నారు. ఆయా పనుల వల్ల తోటలకు బలం చేకూరి అధిక దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. కొబ్బరి తోటల నిర్వహణతో పాటు వాటి అభివృద్ధికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

**భూమి సారవంతమవుతుంది**



వరి చేలల్లోని నల్లరేగడి మట్టి కొబ్బరి తోటల్లో వేయడం వల్ల భూమి సారవంతమై కొబ్బరి దిగుబడులు బాగుంటాయి. వరి చేలల్లో ఉన్న ఎత్తు పల్లాలను చదును చేసి ఆ మట్టిని కొబ్బరి తోటలకు వినియోగిస్తున్నాం.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

**నీటి తడులు తప్పనిసరి**



వేసవిలో కొబ్బరి తోటల్లో మెరక పనులు చేపట్టి భూమిని సారవంతం చేసుకోవడం మంచిది. మెరక పనులు పూర్తి కాగానే నీటి తడులు కూడా పెట్టుకోవాలి. లేదంటే పిందెలు రాలిపోయే ప్రమాదముంటుంది.

– ఎస్.ప్రశాంతకుమార్, వ్యవసాయాధికారి, ముమ్మిడివరం

## ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ జానకి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి సూచించారు. మండల పరిషత్ కార్యాయలంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నా గత విద్యా సంవత్సరం కంటే ఈ ఏడాది మండలంలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. లోపాలను సరిచేసుకుని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి మాట్లాడుతూ వ్యవసాయానికి ఉపయోగపడే భూములను ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్వా సాగు భూములుగా మార్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లవిల్లి సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగమయ్యలు మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో నీరు దిగక ముంపుకు గురవుతున్న రంగరాజు కోడు మీడియం డ్రెయిన్ పూడికతీతకు రూ.94 లక్షలు కేటాయించడం హర్షనీయమన్నారు. సమావేశంలో ఎంపీపీ జానకి మాట్లాడుతూ తరచూ విద్యుత్ కోతలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏఈ శ్రీహరికి సూచించారు. తమ ప్రమేయం లేకుండా గ్రామాల్లో ఉపాధి పనులు ప్రజలకు నిరుపయోగం అయిన చోట చేయిస్తున్నారని గొల్లవిల్లి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, గోపవరం ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఎఫ్‌డీవో నాగమణి, ఎంపీడీవో కేవీఎస్ గౌరీకుమారి, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంఈఓ కిరణ్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పంట కాలువలో పూడికలు తొలగించాలి



ఇంజరం వంతెన వద్ద పూడికలతో మూసుకుపోయిన ప్రధాన పంట కాలువ

తాళ్లరేవు: మండల పరిధిలోని ప్రధాన పంటకాలువలో ఇంజరం వంతెన వద్ద పూడికలు పెరిగిపోవడంతో సాగునీరందడం లేదని, తక్షణమే పూడికలను తొలగించాలని రైతులు ఆర్.సుబ్రహ్మణ్యం, డి.బుజ్జిబాబు, ఎస్.మూర్తి, కె.సత్తిబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు కోరుతున్నారు. వర్షాలు లేకపోవడం, సాగునీరు పూర్తి స్థాయిలో రాకపోవడంతో ఖరీఫ్ సాగు పనులకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. కాలువల ఆధునీకరణ జరగకపోవడం, కాలువల్లోని పూడికలను ఇరిగేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో సాగునీరందడం లేదని శివారు గ్రామాలైన గ్రాంటు, రాంజీనగర్, మూలపాలెం, జార్జిపేట, నీలపల్లి, పోలేకుర్రు, కోరంగి ప్రాంతాల్లోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యకు అధిక ప్రాధాన్యం



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న నాయకులు



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి

ముమ్మిడివరం: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని పలువురు నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సీహెచ్ గున్నేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వీరహనుదుర్గ పద్మజ, గొలకోటి రాజబాబు, విద్యా కమిటీ చైర్మన్ జి.పల్లంరాజు, గనిశెట్టి కాశి విశ్వనాథం, గాలిదేవర కృష్ణమూర్తి, హెచ్ఎం పి.తాతాయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతిభకు పురస్కారాలు**

అల్లవరం: అల్లవరం ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చాటిన పదో తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ఎన్.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం జగన్ ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి కష్టపడి ఉన్నత చదువులు చదవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్ము బాలవేణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గెద్దాడ శ్రీను, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు దానం రాంబాబు, కొనుకు మహేష్, నూరిబాబురాజు పాల్గొన్నారు. దేవగుప్తం ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం అప్పారి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించి ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ఎంఈఓ-2 గా పదోన్నతి పొందిన వెంకటరమణ, వివిధ పాఠశాలలకు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, చింతా రామకృష్ణ, పినమాల విక్రమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సమస్యలపై హోంశాఖ కార్యదర్శికి ఫిర్యాదు

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్

యానాం: యానాంలో నెలకొన్న పలు సమస్యలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శిని కలిసి ఫిర్యాదు చేసినట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ బుధవారం తెలిపారు. ముఖ్యంగా యానాంని మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారని, ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్ముతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయుష్మాన్‌భారత్ ద్వారా రోగులకు వైద్యం చేయడానికి కాకినాడలో ఉన్న పలు కార్పొరేట్ ఆసుపత్రులు నిరాకరిస్తున్నాయని, అటువంటి ఆసుపత్రులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కోరారు. యానాంలో విద్య, ఆరోగ్య శాఖల్లో తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందినవారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

### వచ్చే నెల 23న యూడీసీ పరీక్ష

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా వచ్చే నెల 23న ఆదివారం అప్పర్ డివిజన్ క్లర్క్(యూడీసీ) పరీక్ష నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ కార్యదర్శి వి.జయశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్ష హాల్ టికెట్స్ తదితర వివరాలకు రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

### పళ్లాలమ్మ హుండీ ఆదాయం రూ.2.61 లక్షలు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ ద్వారా 42 రోజులకు రూ.2,61,800 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం పాలకమండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ తెరచి లెక్కించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, స్థానిక నాయకులు సబ్బితి సత్యనారాయణ, ఇళ్ల రాంబాబు, కంచుస్తంభం రాంబాబు, కట్టా రాంబాబు, బండారు సత్తిరాజు, దేవ్వలపూడి మాధవరావు, బండారు పేర్రాజు, బండారు సత్తిబాబు, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నేడు మార్కెట్ కమిటీ సమావేశం

అంబాజీపేట: స్థానిక మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వేటుకూరి వెంకటరాజు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. పాలకవర్గ సభ్యులంతా విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## జీవీటీ ట్రస్ట్ సేవలు అభినందనీయం



ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణను సత్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: అమలాపురంలోని గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్ట్(జీవీటీ) పేద ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. స్థానిక గారపాటి వీధిలో బుధవారం జరిగిన ట్రస్ట్ తొలి వార్షికోత్సవ వేడుకలకు కమిషనర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త గారపాటి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ సభలో పలు రంగాల్లో ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేసి సత్కరించారు. ట్రస్ట్ తరపున ఉత్తమ ఉపాధ్యాయులుగా శ్రీపాద సత్యనారాయణ, బెస్ట్ శాస్త్రవేత్తగా పి.సోమరాజు, ఉత్తమ సామాజిక వేత్తగా అమలాపురం కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి డి.చైతన్య పావని, నీట్‌లో ఆలిండియా స్థాయిలో 721వ ర్యాంక్ సాధించిన ఎం.దేవి శిరీషలను సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గంధం రామం, కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు, అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, తిక్కిరెడ్డి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ట్రెజరీస్ అకౌంట్స్ అధికారికి సత్కారం



అకౌంట్స్ అధికారి రామనాథాన్ని సత్కరిస్తున్న జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన జిల్లా ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అధికారి బి.రామనాథంను స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధుల బృందం కలిసి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ పెన్షనర్లంటే తనకెంతో గౌరవమని, వారు తన దృష్టికి ఏ సమస్యను తీసుకొచ్చినా తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన పెన్షనర్లతో అనేక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అమలాపురం ట్రెజరీ అధికారి సత్యబేత వీర వెంకట రంగారావు, ముమ్మిడివరం ట్రెజరీ అధికారి భీమేశ్వరరావు, పెన్షనర్స్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాద్, కోశాధికారి జయంతి సోమేశ్వరశర్మ, ఉపాధ్యక్షుడు కలిగినీడి ఉదయభాస్కర్, మహబూబ్ షహీరా తదితరులు పాల్గొన్నారు.

## క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన హేమ శ్వేతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కాట్రేనికోన: యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాలలో బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఓలేటి హేమ శ్వేత ప్రథమ స్థానం, కందికుప్ప జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థిని బడుగు శ్రీలక్ష్మి ద్వితీయ స్థానం, లక్ష్మివాడ జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి గాలిదేవర వెంకటరమణ హాసిని తృతీయ స్థానం సాధించారు. మండల స్థాయి ప్రథమ బహుమతికి రూ.5 వేలు, ద్వితీయ బహుమతికి రూ.4 వేలు, తృతీయ బహుమతికి రూ.3 వేలును విజేతల బ్యాంకు ఖాతాలో జమచేస్తామని క్విజ్ నిర్వాహకులైన యూనియన్ బ్యాంకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు రమాదేవి, చంద్రరాజు, సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### కౌలు రైతులకు పంట రుణాలు



ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం: మండలంలోని కోడూరుపాడులో 33 మంది కౌలు రైతులు పంట రుణాలకు దరఖాస్తు చేశారని, వారంలోగా వారికి రుణాలు అందుతాయని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. కోడూరుపాడు రైతు భరోసా కేంద్రంలోని పీఎం కిసాన్ పథకంలో లబ్ధిదారుల ఈకేవైసీ నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌కు నారుమళ్లు త్వరగా వేసేలా రైతులను ప్రోత్సహించాలని, రైతుల అవసరాలకు తగ్గట్టుగా విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ సహాయకులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఏడీ షంషీ, ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయ సహాయకులు శ్రావణి, శుభగణేష్, రైతులు నెల్లి రామారావు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, ఇళపకుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు



ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



తాళ్లరేవు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తున్న శ్రీకృష్ణ



యోగా సాధన చేస్తున్న వాకర్స్

- జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అమలాపురం రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అన్నారు. బుధవారం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జిల్లా స్థాయి అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ సత్తిబాబు మాట్లాడుతూ మన పూర్వీకులు మనకు అందించిన అద్భుతమైన సంపద యోగా అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీఎస్ ప్రసాదరావు యోగా, పర్యావరణ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు సురేష్‌కుమార్, సీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని స్వామి వివేకానంద సేవాసమితి ప్రతినిధి పితాని శ్రీకృష్ణ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తాళ్లరేవు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో యోగ సాధకులు, చిన్నారులచే యోగాసనాలు వేయించారు.

అమలాపురం టౌన్: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చంద్రబాబునాయుడు ఆరోగ్య ఉద్యానవనంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా నిపుణురాలు సీహెచ్ ఉషారాణి తోటి వాకర్స్‌చే యోగసానాలు వేయించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. స్థానిక సహస్ర స్కూలు విద్యార్థులు స్కూలు క్రీడా స్థలంలో సూర్య నమస్కారాలతో యోగాసనాలు వేసి సూర్య బింబం, కిరణాలు ఆకారంలో చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

అల్లవరం: ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవం బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వీఎస్ఎం అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన విశ్రాంతి మెడికల్ ఆఫీసర్ కేవీ సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. అల్లవరం ఉన్నత పాఠశాల ప్లస్‌లో బ్రహ్మకుమారీ ప్రతినిధుల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్నారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన యోగా దినోత్సవాన్ని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

యానాం: స్థానిక వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జరిగిన యోగా దినోత్సవంలో ఆర్ఏఓ మునిస్వామి, వివిధ పాఠశాలల విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. యానాం సబ్‌కోర్టులో సబ్ జడ్జి రాజ్‌మోహన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

అమలాపురం రూరల్: ఎ.వేమవరంపాడు గ్రామంలో అమృతసరోవర్ పనుల వద్ద పీడీ ఎస్.మధుసూదన్, ఏపీవో శివకుమారిలు యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధి కూలీలతో యోగాసనాలు వేయించారు.

### పశువులకు బీమా

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువులో డాక్టర్ పూర్ణిమ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమలాపురం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడున్న మేకలకు పశు బీమా చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా పాడి పశువులు, గొర్రెలు, పందులకు బీమా పథకాన్ని అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న వారికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సహాయకులు మోహన్, సాయినాథ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రకటన**

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ భీమవరం వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ **అబిశెట్టి సాయి నాగ ఆదిత్యనాయుడు** తం॥ శ్రీ **సత్యనారాయణ** మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. అమలాపురం సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నెం.12078/2022, ఆర్.యస్.నెం.302/2ఎ, 302/2 అమలాపురం పట్టణానికి చెందిన 208-12-00 చ.గ. స్థలానికి హద్దులు తూర్పు : ఉమ్మడి దారి, పడమర : అయితాబత్తుల ఆనందరావు తదితరుల స్థలాలు, ఉత్తరం : కటికల సత్యనారాయణ స్థలం, దక్షిణం : రేకళ్ల చిన్నా స్థలం.

**పి.డి.యస్.వి.బాలాజీ**, బి.కాం., బి.ఎల్., అడ్వకేటు, పాలకొల్లు, సెల్ : 94904 38732